క్లుప్తంగా

కుష్టు రహిత సమాజం కోసం కృషి



రాపూరు-కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న రాజకుమారి

రాపూరు: కుష్టు రహిత సమాజం కోసం వైద్య సిబ్బంది కృషి చేయాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు రాజకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం గోనునరసాయిపాళెంలో ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే చేపట్టారు. కుష్టువ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రాంతాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేస్తామన్నారు. గుర్తించిన వారిని జిల్లా కుష్టు వైద్య నిపుణులు పరిశీలించి నిర్ధారించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

ఓజిలి: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను కార్డుదారులకు సకాలంలో అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ కింద జాబ్ కార్డు కలిగిన వారికి వంద రోజులు పనులు కల్పించాలన్నారు.

కోస్టల్ రెగ్యులేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

దొరవారిసత్రం: కోస్టల్ రెగ్యులేషన్‌పై అభ్యంతరాలు తెలపాలని ఆర్డీవో చంద్రముని తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో వాకాడు, సూళ్లూరుపేట, తడ, కోట, చిట్టమూరు, చిల్లకూరు, డీవీ సత్రం మండలాల్లోని తీర ప్రాంతాల ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు కోస్టల్ రెగ్యులేషన్‌పై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. దీనిపై అభ్యంతాలు తెలపాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శివరాజు, ఏపీసీజెడ్ఏఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

దక్కిలి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు 2014 నుంచి 2019 వరకు అమలుచేసిన పథకాలను తిరిగి ప్రవేశపడతామన్నారు. రైతులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లీలా మాధవి, హౌసింగ్ డీఈ జహీరుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్, ఆర్అండ్‌బీ ఏఈఈలు నాగరాజు, చంద్రశేఖర్,రాజా, బాబు, ఎంపీటీసీ అలిమిలి చంద్రశేఖర్‌రెడ్డి, వి.చెంచయ్య, పరుశురామయ్య, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు

సూళ్లూరుపేట : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా రవాణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు, న్యాయవాది ధర్మాప్రసాద్ తెలిపారు. సూళ్లూరుపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ యాక్ట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ధర్మాప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. పీఎస్ఆర్‌వీ ప్రసాద్, పి.లక్ష్మయ్య, సి.చక్రవర్తి, బి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మరో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలం మేనకూరు సమీపంలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గాయపడిన మరో యువకుడు గుండాల అశోక్(24) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మేనకూరు సెజ్ ఇండూస్ కాఫీ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కర్నూలు జిల్లా సీ బెలగళ్ మండలం ముడుమాలకు చెందిన కురువ రామాంజనేయులు(24) మృతిచెందిన విషయం తెలిసిందే. ఇద్దరు యువకుల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గాయపడిన తేజ, హేమచంద్ర తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు.



కొండవల్లిపాడులో మేత మేస్తున్న గొర్రెలు



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

వర్షాకాలంలో మూగజీవాలు జాగ్రత్త

- గాలికుంటు, గొంతువాపుతో ప్రాణాపాయం
- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
- పశువైద్యాధికారి గౌతమ్



ఓజిలి: పంటల సాగుతో పోలిస్తే గొర్రెలు, మేకల పెంపకం లాభదాయకమని మండల పశువైద్యాధికారి గౌతమ్ తెలిపారు. వర్షాకాలంలో మూగజీవాలకు ఎక్కువగా గొంతువాపు, నీలి నాలుక, గాలికుంటు (ఫుట్ అండ్ మౌత్), చిటుకు వ్యాధి, దొమ్మరోగం, నిమోనియా(గుండెజబ్బు), అమ్మతల్లి, పరాన్న జీవులు బెడద(నట్టలు) తదితరాలు ఎక్కువగా వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సరైన సమయంలో మందు వేయడంతోపాటు చికిత్స చేస్తే గొర్రెలు, మేకలతోపాటు పాడిపశువులను కాపాడుకోవచ్చని వెల్లడించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఓజిలి మండలంలో ఎక్కువ మంది వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాగే మేకలు, గొర్రెలను మేపుకుంటున్నారు. మండలంలో 39,500 గొర్రెలు, 6,210 మేకలు, 12,720 గేదెలు, ఆవులు సుమారు 6 వేలకు పైగా ఉన్నాయి. సుమారు 1,050 మంది పాడి రైతులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. పచ్చిక పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మూగజీవాలు అంటువ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వాటిని కాపాడుకోవచ్చని పశువైద్యాధికారి గౌతం తెలిపారు.

గొంతువాపు

పాశ్చురెల్లా జాతి సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ఎక్కువగా ఇది జూన్, అక్టోబర్ నెలల్లో సక్రమిస్తుంది. గొంతు, చాతీ, తల భాగాల్లో నీరుచేరడం వల్ల వాపు వస్తుంది. కళ్లు, ముక్కు, నోటి నుంచి నీరు కారుతుంది. దీంతో మూగజీవాలు సరిగ్గా మేత మేయలేవు. వాటికి గొంతువాపు, జబ్బవాపు మిశ్రమ టీకా 5 మిల్లీలీటర్లు చొప్పున వేయడం ద్వారా నయం చేయవచ్చు.

చిటుకువ్యాధి(నోటిగాలి)

తొలకరి చినుకులు పడిన తరువాత పెరిగిన గడ్డిని తినడం వల్ల క్లాస్ట్రీడియం జాతి బాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి లక్షణాలు కనిపించవు. గొర్రెలు గిలాగిలా కొట్టుకుని గాలిలోకి ఎగిరి కింద పడి వెంటనే మృతి చెందుతాయి. వైద్యులు సలహా మేరకు ఆక్సిటో ట్రాసైక్లిన్ మందును 5–10 మిల్లీగ్రాములను కిలో బరువుకు లెక్కగట్టి ఇవ్వాలి. ప్రతి ఏటా మే, జూన్ మొదటి వారంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

దొమ్మ రోగం(అంత్రాక్స్)

ఇది కలుషిత నీరు, మేత కారణంగా వ్యాపిస్తుంది. తీవ్రమైన జ్వరం, తూలిపడడం, కాళ్లు పడిపోయినట్లు ఉండి మృతి చెందుతుంది. నోరు, ముక్కు, చెవులు, మలద్వారం నుంచి నల్లని గడ్డకట్టని రక్త కారుతుంది. ఇది బాసిల్లస్ బ్యాక్టీరియా వల్ల వస్తుంది. వర్షా కాలంలో జీవాలకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో చనిపోయిన జీవాలను లోతైన గుంతలో సున్నం వేసి పూడ్చిపెట్టాలి. వ్యాధి సోకిన గ్రామంలో అన్ని జీవాలకు ఆంత్రాక్స్ టీకాలు వేయాలి.

నిమోనియా(గుండె జబ్బు)

ఇది వైరస్ ఇతర సూక్ష్మక్రిముల ద్వారా వ్యాపిస్తుంది. చలి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుంది. జ్వరం, దగ్గు, ముక్కు నుంచి చీమిడి, నీరు కారుతుంది. కిలో బరువుకు 4–5 మిల్లీగ్రాముల గ్రాస్ట్రెప్టోపెన్సిలిన్ లేదా జంటా మైసిన్ టీకాలు వేయాలి.

పరాన్నజీవులు బెడద(నట్టలు)

సాధారనంగా పశువులు, మూగజీవాలను అంతర పరాన్నజీవులైన ఏలికపాములు, జలగలు, బద్దె పురుగులు ఆశిస్తాయి. మూగజీవాలకు వర్షాకాలం ముందు నట్టల నివారణ మందులు వేయించాలి. లేదంటే జీవాలు నీరసించి, పారుకుని మరణిస్తాయి. చర్మంపై బాహ్యపరాన్న జీవులుండి రక్తాన్ని పీల్చుకుని హాని కలుగజేస్తాయి. నట్టల నివారణకు నాలుగు దశల్లో టీకాలు వేయాలి.

అమ్మతల్లి(మశూచి, బొబ్బరోగం)

ఇది వైరస్ వల్ల సోకే అంటువ్యాధి. జ్వరంతో కళ్లు ఎర్రబడతాయి. వెంట్రుకలు లేని శరీరంలో బొబ్బలు ఏర్పడతాయి. వ్యాధి తీవ్రతను బట్టి 50 శాతం పెద్ద గొర్రెలు, 90 శాతం గొర్రె పిల్లలు చనిపోతాయి. వ్యాధి సోకిన గొర్రెలను వేరుచేసి బొబ్బలు, పుండ్లకు వేపనూనె హిమాక్స్ మందు పూయాలి. వ్యాధి రాకుండా నవంబర్– డిసెంబర్ నెలల్లో టీకాలు వేయించాలి.

గొర్రెలు:	39500
మేకలు:	6210
గేదెలు:	12720
ఆవులు	6000
పాడిరైతులు:	1050

మెరుగు పడుతున్న విద్యార్థుల ఆరోగ్యం



నాయుడుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ప్రిన్సిపాల్

నాయుడుపేట టౌన్: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం కుదుట పడుతోందని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాదాఫీర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు జీజీహెచ్‌లో ఏడుగురు, నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఒకరు చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్టు పేర్కొన్నారు.

22 నుంచి తరగతులు

విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడుతున్న నేపథ్యంలో 22 నుంచి 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ దాదాఫీర్ తెలిపారు. పాఠశాలలోని విద్యార్థుల డార్మెటరీలు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో మరమ్మతు పనులు చేస్తున్నామని, వారం రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. ప్రస్తుతం వాడుతున్న డార్మిటరీ మిద్దెపై గదులను 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న మరో డార్మెటరీ, తరగతి గదులకు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేయిస్తున్నట్టు వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గూడూరు రూరల్: మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం స్థానిక టవర్ క్లాక్ ప్రాంతంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. కొంద మందిని కిరాతకంగా చంపేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబ్టారు. మహిళలకు రక్షణ కల్పిస్తామంటూ ప్రభుత్వం ప్రకటనలకే పరిమతం అవుతోందని, దీనిపై దేశ రక్షణ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గూడూరు, సూళ్లూరుపేట డివిజన్‌ల పరిధిలో రెండు రోజుల్లోనే ఇద్దరిపై లైగింక దాడికి పాల్పడడంతో పాటుగా ఒకరిని దారుణంగా చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశి, నాయకులు యశ్వంత్, ప్రణయ్, విక్రమ్, సందీప్, సతీష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులతో దోమల నివారణ



పెళ్లకూరుమిట్ట ప్రాంతంలో నీటిలో క్లోరినేషన్ చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణారావు తెలిపారు. ఆయన శుక్రవారం పంచాయతీ సిబ్బందితో కలిసి పెళ్లకూరు మిట్ట గ్రామంలో తాగునీటి కొళాయిలు, బోర్ల వద్ద చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి బావులు, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఎన్ఎం నాగూరమ్మ, రమ్య, సుష్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కోట: మండలంలోని తీరప్రాంతం కొత్తపట్నంలో పరిశ్రమలకు కేటాయించిన భూములను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం కొత్తపట్నం సచివాలయం వద్ద గ్రామసభలో రైతులతో మాట్లాడారు. కొత్తపట్నంలో పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెన్నై–బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 444 ఎకరాలు సర్వే చేసినట్టు తెలిపారు. వాటిలో డీకేటీ, అసైన్‌మెంట్‌తో పాటు ఎలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూమిలో అనుభవంలో ఉన్న వారు కూడా ఉన్నట్లు రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వారందరికీ న్యాయం చేయాలని కోరారు. సర్వే టీంలతో మరోసారి భూసర్వే చేయించి అర్హులందరికీ న్యాయం చేస్తామని కలెక్టర్ తెలిపారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నాగరాజారావు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయం ఎంతో మేలు



మెటా డీఏపీని విడుదల చేస్తున్న రైతులు, కోరమాండల్ సిబ్బంది

గూడూరు రూరల్ : మెటా(నానో) డీఏపీ వాడితే అధిక దిగుబడి వస్తుందని సీనియర్ శాస్త్రవేత్త చక్రధర్ తెలిపారు. గూడూరు రూరల్ పరిధిలోని తిరువెంగళాయపల్లి, చెమిర్తి, తిరుపతిగారిపల్లిలో శుక్రవారం గూడూరులోని కోరమాండల్, మన గ్రోమోర్ సంయుక్తంగా రైతులకు ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని, దీనివల్ల పలువురు అనారోగ్యం పాలువుతున్నారని వివరించారు. దీన్ని అధిగమించి మంచి భవిష్యత్తును ఇచ్చేందుకు ఆర్గానిక్ వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. అనంతరం నిమ్మలో వచ్చే తెగుళ్ల నివారణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ జగదీశ్వర్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ మోహన్‌క్రిష్ణ, గూడూరు మేనేజర్ చినరాజులు పాల్గొన్నారు.

పొర్లుకట్టల పనులు చేపట్టాలి



స్వర్ణముఖినది వద్ద పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

వాకాడు: ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి పొర్లుకట్టల పనులను వెంటనే చేపట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం బాలిరెడ్డిపాళెం, తూపిలిపాళెం గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నది పొర్లుకట్టల మరమ్మతుల కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. పనులను త్వరగా ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలని, స్వర్ణముఖి నదిలో ఇసుక మేటలు తొలగించేందుకు అనుమతి మంజూరు చేయాలని పలు పార్టీలకు చెందిన నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, పలు శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

వలస కూలీ ఆత్మహత్యాయత్నం



జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ

పెళ్లకూరు: కూలి డబ్బులు ఇవ్వకుండా యజమాని ఇబ్బంది పెట్టడంతో మనస్తాపం చెందిన వలస కూలీ శుక్రవారం జీలపాటూరు వ్యవసాయ పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ నుంచి శ్రీకాళహస్తికి వలస వచ్చిన సంతోష్ పట్టణంలో ఒక కాంట్రాక్టర్ దగ్గర పనులు చేసుకుంటున్నాడు. రెండు నెలలుగా కాంట్రాక్టర్ కూలి డబ్బులు ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ శుక్రవారం జీలపాటూరు వ్యవసాయ పొలాల వద్దకు చేరుకున్నాడు. అక్కడ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. పొలాల్లో పనులు చేస్తున్న రైతులు గుర్తించి అడ్డుకున్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్ అక్కడికి చేరుకుని విచారించారు. అనంతరం అతన్ని సొంత ఊరికి వెళ్లేందుకు నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించారు.

సూళ్లూరుపేట టీడీపీలో వర్గపోరు

ఓజిలి: సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీలో వర్గపోరు కొనసాగుతోంది. నాయకులు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించవద్దని, కలిసికట్టుగా నడవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం తెలిపారు. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించిన తర్వాత మొదటిసారి ఆయన ఓజిలికి వచ్చారు. ఆయనకు స్థానిక నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి స్వాగతం పలికారు. దీనిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వెలుగు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేయాలని, వర్గాలుగా విడిపోతే పార్టీ పరువుపోతుందని చురకలంటించారు. పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ నాయుడు అందరినీ కలుపుకునిపోవాలన్నారు. అనంతరం రెండు వర్గాల వారితో స్థానిక నాయకుడు కంకణాల సత్యవరప్రసాద్‌రావు తోటలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువురిని కలిపేందుకు ఇన్‌చార్జి తలపట్టుకోవాల్సి రావడం కొసమెరుపు.

కండలేరులో 6.286 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.286 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

దక్కిలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. ఆమె శుక్రవారం సిబ్బందితో కలిసి దక్కిలి పంచాయతీ కందలవారిపల్లి ఎస్టీ కాలనీలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ద్వారా అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆడ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. సూపర్‌వైజర్ పరిమళ ఉన్నారు.

ఆడ పిల్లలను చదివిద్దాం

చిల్లకూరు: ఆడ పిల్లలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. మండలంలోని అల్లీపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని వారు ఆడిపిల్లలను బడికి పంపకుండా పనులకు పంపుతున్నారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను దగ్గరలో ఉండే అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్టు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి పాల్గొన్నారు.

ఓజిలిలో బేటీ బచావో.. బేటీ పడావో..

ఓజిలి: బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజన, ఆశా బేగం తెలిపారు. వారు శుక్రవారం ఓజిలి ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు బాల వివాహాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్లి చేయడం నేరమన్నారు. బాలికలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాతే వివాహం చేయాలన్నారు. పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు గీత, మురుగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల భూముల ఆక్రమణకు యత్నం





పేదల భూముల్లో వేసిన రోడ్డు, భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

- రోడ్డు వేసిన వైనం
- బాధితుల ఫిర్యాదుతో తహసీల్దార్ పరిశీలన

చిల్లకూరు: మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన పేదలకు పంపిణీ చేసిన భూముల్లో రెండు రోజుల క్రితం రోడ్డు వేశారు. దీంతో లబ్ధిదారులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కడివేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 960 నుంచి 968 వరకు 65 మందికి ఒక ఎకరం చొప్పున గతంలో పంపిణీ చేశారు. అప్పటి నుంచి అందులో మెట్ట పంటలు పండించుకుంటున్నారు. కొద్ది కాలంగా ఆ భూముల్లో సాగు చేపట్టలేదు. ఈ క్రమంలో వాటిపై కన్నేసిన కొంత మంది నాయకులు ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దర్జాగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై కడివేడుకు చెందిన దళితులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శ్రీనివాసులు వెంటనే అక్కడికి సిబ్బందితో కలిసి వెళ్లి రోడ్డు నిర్మాణంతో పాటు ట్రెంచ్‌ను పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నాణ్యమైన కూరగాయలు వినియోగించండి



డీవీ సత్రం కేజీబీవీలో టీచర్లకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారి చైతన్య

దొరవారిసత్రం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే వంట గదిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, మరుగుదొడ్లు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదన్నారు. ఆహార పదార్థాల ద్వారా విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తితే టీచర్లు, ఏజెన్సీ నిర్వాహకులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. డాక్టర్ చంద్రకళ, వైద్య సిబ్బంది సంపూర్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వినూత్న శుభాకాంక్షలు



ఒలింపిక్స్ లోగోలా ఏర్పడిన విద్యార్థులు

సూళ్లూరుపేట రూరల్: ఈ ఏడాది ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడా పోటీలకు భారత దేశం నుంచి 117 మంది క్రీడాకారులు వెళుతున్నారు. వారికి సూళ్లూరుపేట మండలం కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పాఠశాల మైదానంలోని ఒలింపిక్స్ లోగోలా ఏర్పడి అందరికీ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 26 నుంచి ఆగస్టు 11 తేదీ వరకు ఒలింపిక్స్ పోటీలు జరగనున్నాయి.

అవసరం లేకపోయినా పోలీసు పికెట్



చిల్లకూరులో పోలీస్ పికెట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

చిల్లకూరు: అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చని టీడీపీ నేతలు రుజువు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. పోలీసులు ఇరువురికి నోటీసులు ఇచ్చి పంపించేశారు. తర్వాత వివాదం సద్దుమణిగింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను ఇబ్బందులకు గురిచేయానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా చిల్లకూరులో ఎన్నో ఏళ్లుగా కాలువ గట్టుపై బాడుగకు చికెన్ స్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తి దుకాణాన్ని తొలగించారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు గొడవకు దిగకుండా అదేప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో గొడవలు జరిగిన సమయంలోనూ పోలీసు పికెట్ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకు నలుగురు చొప్పున పోలీసు కానిస్టేబుళ్లు పికెట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీని వల్ల స్టేషన్లో సిబ్బంది కొరత ఉంటోంది. దీనిపై సీఐ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పికెట్ ఎత్తి వేసేలా చూస్తామన్నారు.